# అమెరికాలో పెరుగుతోన్న సాంస్కృతిక పతనం-నైతిక విలువల సంక్షోభం

**న్యూయార్క్‌కు** చెందిన పేటన్ జెండ్రాన్ అనే 18 సం॥ల శ్వేతజాతి యువకుడు, మే 14న న్యూయార్క్ కిరాణా దుకాణం బఫెలో లో జొరబడి, జరిపిన తుపాకి కాల్పులలో పదిమంది మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. అతను తలపై పెట్టుకున్న హెల్మెట్‌లోని కెమెరాగుండా – జాతివివక్షతో కేకలు పెడుతూ ఉద్దేశ్యపూర్వకంగా సాగించిన ఈ హత్యాకాండ మొత్తం ప్రత్యక్ష ప్రసారమైంది. బాధితులలో 11 మంది ఆఫ్రికా జాతీయులైన అమెరికన్లు. ఈ కాల్పులు జరపటానికి ముందుగా, హంతకుడు తన పథకాల్ని, ఈ దాడికి తనను ప్రేరేపించిన అంశాల్ని చాలా వివరంగా ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడని అధికారులు వెల్లడించారు. హంతకుడు ఆన్‌లైన్‌లో పేర్కొన్న తన ప్రణాళిక ప్రకారం – 2019 మార్చిలో న్యూజిలాండ్‌లోని క్రైస్ట్ చర్చి పట్టణంలోని మసీదులో జరిగిన 51 మంది ముస్లిముల ఊచకోత ఘటనతో సహా అతి తీవ్ర శ్వేతజాత్యహంకార హింసాత్మక చర్యలతో తాను చాలా ఉత్తేజం పొందినట్లుగా పేర్కొన్నాడు. కిరాణా దుకాణంలో కాల్పులు జరపటానికిగాను హంతకుడు "సుదూర ప్రాంతం నుండి అనేక గంటలపాటు ప్రయాణం చేసివచ్చి మరీ ఈ చర్యకు పాల్పడ్డాడు". హంతకుడు గత సంవత్సరమే, హైస్కూల్ స్థాయిలోనే "ఈ ధోరణితో హెచ్చరికలు" చేయగా, రాష్ట్ర పోలీసులు అతని మానసిక ఆరోగ్య పరిస్థితి పరిశీలన కోసం ఆసుపత్రికి పంపగా, ఒకటిన్నర రోజుల్లోనే అతను బయటకొచ్చాడు.

మరొక ఘటనలో–మే 16న కాలిఫోర్నియా – లాగునా వుడ్స్ పట్టణంలోని ఓ చర్చిలో ఓ దుండగుడు జరిపిన కాల్పులలో ఒకరు మరణించగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

తిరిగి పదిరోజులలోనే, మే 24న శాన్ ఆంటానియోకి పశ్చిమంగా 135 కి॥మీ॥ దూరంలోని యువాల్డేలోని టెక్సాస్ ప్రాథమిక పాఠశాలలో సాల్వడార్ రామోస్ అనే 18 సం॥ల యువకుడు ప్రవేశించి తుపాకితో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఊచకోతలో ఇద్దరు ఉపాధ్యాయులతోసహా 19 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఆ రాష్ట్ర సెనేటర్ రొనాల్డ్ గుటియెర్జ్ చెప్పినదాని ప్రకారం, ఒక దాడి జరగబోతోందని ఈ దాడికి పాల్పడిన రామోస్ సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొంటూ, పిల్లలు 'తప్పనిసరిగా జాగ్రత్తగా చూడండి' అని సూచనలు కూడా చేశాడట! 18వ సం॥లోకి ప్రవేశించగానే అతడు 'రెండు మందుగుండు మారణాయుధాలు' కొనుగోలు చేశాడు.

గణాంకాలను పరిశీలిస్తే కూడా గత నాలుగు దశాబ్దాల కాలంగా తుపాకి కాల్పుల ఘటనలు, మూకుమ్మడి హత్యా ఘటనలు పరిగణించదగిన స్థాయిలో పెరుగుతున్నాయి. 2018 సం॥ నుండి తుపాకి కాల్పులు జరిపి హత్యలు చేసిన ఘటనలు 118 కాగా, ఒక్క 2022 సం॥లోనే పాఠశాలల్లో తుపాకీ కాల్పుల ఘటనలు 26 జరిగాయి.

అమెరికాలో బలమైన 'తుపాకీ కాల్పుల సంస్కృతి' ఏవిధంగా వ్యవస్థీకృతమైందో పై గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగానూ, అమెరికాలోనూ నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానాల రూపకల్పన, అమలు వేగవంతంగా జరుగుతూ వస్తున్నాయన్న అంశం మనం గుర్తుచేసుకుంటే, 'వైల్డ్ వెస్ట్', తుపాకి కాల్పులు జరిపి సామూహికంగా హత్య గావించటమనే సంస్కృతి అమెరికాలో ఎంత బలంగా, ఏవిధంగా పాతుకుపోయిందనేది అర్థమౌతుంది.

మాటిమాటికీ ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభ కారణంగా ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ – పునరావృతమయ్యే ఈ ఆర్థిక సంక్షోభాలను, దానితోపాటే ఏర్పడే ఆర్థికమాంద్యాలను అధిగమించేందుకు నయా ఉదారవాద ప్రపంచీకరణ రూపమెత్తింది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఈ నూతన రూపం – ధనం, ఆహారంల వంటివాటి గురించిన అత్యాశను, కొద్దికాలంలోనే బాగా సంపాదించాలనే కాంక్షను, డబ్బు సంపాదనే ధ్యేయంగా వుండే తీవ్ర మనస్తత్వాన్ని, అత్యంత స్వార్థపరత్వాన్ని, బూటకపు పొగడ్తలను, అహంభావాన్ని, ప్రక్కవాడిని తొక్కిపట్టి అయినా, తన ఎదుగుదల, అభివృద్ధి గురించి మాత్రమే తీవ్రంగా తపనపడే నగ్నమైన కెరీరిజం.... వంటి భావజాలాన్ని, సంస్కృతిని ప్రచార, ప్రసార మాధ్యమాల పూర్తి దన్నుతో, వాటి ప్రచారాలతో ప్రజల మధ్యన ప్రత్యేకించి అమెరికాలోని యువత నడుమ పెంచి పోషిస్తూ, వారిని మానసిక రోగులుగా తయారుచేస్తోంది. ప్రజాసంక్షేమాన్ని ఈ వ్యవస్థ నెరవేర్చలేదనేది స్పష్టం. అయితే విడివిడిగా కొందరు వ్యక్తులుగా చేసిన తీవ్ర ప్రయత్నాల ఫలితంగా వారిలో కొద్దిమంది మాత్రమే 'విజేత'లుగా నిలుస్తుండగా, దీనికి ఎన్నోరెట్ల మంది పరాజితులుగా, భవితపై ఎలాంటి ఆశాలేని నిరాశాజీవులుగా మిగిలిపోతున్నారు. కనుక సహజంగా అమెరికా ప్రజానీకం – ప్రత్యేకించి భవిష్యత్ పౌరులైన అమెరికా యువత – తీవ్ర నిరాశా, నిస్పృహలకు లోనై, సాంస్కృతిక – నైతిక సంక్షోభానికి బలౌతున్నారు.

నైతిక విలువలు, నీతి సూత్రాలు, ప్రగతిశీల భావజాలం లభించని అమెరికా సమాజం, ఆ దేశపు యువతను పెడదోవ పట్టి పోయేవారిగా, తదనుగుణంగా పసివయసులోనే క్రూర నరహంతకులుగా మారే విధంగా నెడుతోంది. స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ, దోపిడీ అణచివేతల సిద్ధాంతాలను మనసులకు దట్టించటం ద్వారా మంచి చెడుల తారతమ్యం తెలిపే

క్రమశిక్షణ, నీతి నియమాల వంటివి అడుగంటిపోవటాన్ని – ప్రతీఘాతుకమైన తుపాకి సంస్కృతి, సామూహిక హత్యల వంటి సంస్కృతినెంచుకోవటం ద్వారా దాటవేయజూస్తున్నారు.

అయితే, అమెరికా సమాజంలో పాతుకు పోయిన ఈ హీన సంస్కృతి, నైతిక పతనాల వంటి అసలైన కారణాల జోలికి పోకుండా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విషయాన్ని ప్రక్కకు మళ్ళిస్తున్నాడు. తన ప్రత్యర్థి అయిన రిపబ్లికన్ పార్టీని, తుపాకీ తయారుదారులను దూషిస్తూ, వారే ఈ తుపాకీ హింసకు కారకులని ఆరోపిస్తూ, అత్యంత ఘోరమైన విషాదకరమైన సామూహిక హత్యాకాండ వంటి ఘటనల నుండి సైతం రాజకీయ లబ్ధి పొందజూస్తున్నాడు.

వాస్తవానికి పెట్టుబడిదారీవ్యవస్థ అంతర్ గర్భంలోనే దాని స్వేచ్ఛా మార్కెట్, స్వేచ్ఛావాణిజ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదుల్లోనే, దాని దుష్టస్వభావం కలగలసి వుంది. తుపాకి హింస పట్టుసడలించే చట్ట ప్రతిపాదనల్ని అమెరికా కాంగ్రెస్ నిరాకరించేలా తుపాకి వంటి ఆయుధాల తయారీదారులు, రైఫిల్ అసోసియేషన్స్ చేయగలిగారనే వాస్తవమే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నిరర్థకతను వెల్లడి చేస్తోంది; పెట్టుబడిదారీ వ్యవస్థ డొల్లతనాన్ని చాటి చెప్తోంది. కనుక ఈలాంటి వ్యవస్థలోని ప్రభుత్వం, ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రభుత్వం ఇది కానేకాదని, బడా పెట్టుబడిదారుల కొరకు, వారిచేత సాగించబడే, వారి యొక్క పాలనే అని తెలుపుతోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ తమను ఏవిధంగా మోసగించిందీ కనీసం ఈ సంఘటనల తర్వాతనైనా అమెరికాలోని మేధావులు, ప్రజాస్వామిక, అభ్యుదయవాదులు తెలుసుకొని, వారు కళ్ళు తెరుచుకోగలగాలి. లోతుగా దిగజారిపోయిన ఈ సాంస్కృతిక పతనం, నైతిక సంక్షోభాల నుండి బయటపడేందుకు వారు ప్రగతిశీల, శాస్త్రీయ సిద్ధాంతాలను గురించి, సంస్కృతి గురించి ఆలోచించటానికి, ఆచరించటానికి ఇప్పటికైనా పూనుకోవాలి.

*****